## క్లుప్తంగా

### జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో నితిషారెడ్డి ప్రతిభ


పతకాలతో ముని నితిషా రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన గిరిజాల రామకృష్ణారెడ్డి, ఆదిలక్ష్మిల రెండో కుమార్తె ముని నితిషా రెడ్డి జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ –17 క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఇటీవల చండీఘర్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొని ఆరు వికెట్లు తీసి జాతీయ స్థాయిలో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచేందుకు ప్రధాన భూమిక పోషించింది. ఈ విద్యార్థిని వాగ్దేవి పాఠశాలలో పదో తరగతి చదువుతూ రామచంద్రారెడ్డి క్రికెట్ అకాడమిలో శిక్షణ పొందుతోంది. ముని నితిషా రెడ్డిని తల్లిదండ్రులతో పాటు కోచ్ నరేష్ అభినందించారు.

### పెయ్యదూడల ప్రదర్శన


లేగదూడల పాడిరైతులకు బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారులు

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాలలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధకశాఖ, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 76 కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడలను 52 మంది పాడిరైతులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నరసాపురం పశువైద్యాధికారి డాక్టర్ రామారావు మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం వలన ఉపయోగాలు, పశువులలో మేలైన యాజమాన్య పద్ధతులు, ఏడాదికి ఒక దూడ, ఎద లక్షణాలు లాంటి ప్రాముఖ్యతను, దూడల సంరక్షణ, దూడల యాజమాన్య పద్ధతులు, గర్భకోశ వ్యాధుల గురించి పాడిరైతులకు వివరించారు. అనంతరం మొదటి, రెండవ, మూడవ బహుమతులను దూడల యజమానులకు అందజేశారు. అదేవిధంగా మిగతా పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టేకూరుపేట పశువైద్యాధికారి డాక్టర్ శివశ్రీనివాసులరెడ్డి, కడప డీఎల్‌డీఏ కార్యాలయ పశువైద్యాధికారి డాక్టర్ శివరామిరెడ్డి, పశువైద్య సిబ్బంది, సచివాలయాల పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రులు, పాడి రైతులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే నివాళి

దువ్వూరు : మండలంలోని చిన్నసింగనపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నారుపల్లె చక్రధర్ రెడ్డి తండ్రి నారుపల్లె వేణుగోపాల్‌రెడ్డి అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని చిన్నసింగనపల్లెకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి చిన్నసింగనపల్లె గ్రామంలో నారుపల్లె వేణుగోపాల్ రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు.

### మట్కా నిర్వాహకులు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని మంగళవారం సాయంత్రం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన షరీఫ్, ఆటోనగర్‌కు చెందిన నవీన్, చాపాడు మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన గంగయ్యలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 25 వేలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

### ఆహారంతోపాటు ఆటపాటలతో కూడిన విద్య

కాశినాయన : చిన్నారులకు అంగన్‌వాడీలే పట్టుకొమ్మలని జిల్లా ఏపీసీ నిత్యానందరాజు, అసిస్టెంట్ ఏఎంఓ విజయభాస్కర్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మోడల్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు వారం రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో విద్యను ఎలా బోధించాలనే విషయాన్ని వారు తెలియజేశారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు ప్రభుత్వ ఆహారం అందించడంతోపాటు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన ఆటవస్తువులతో వారికి శిక్షణ అందించాలని తెలిపారు.

### రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

ఖాజీపేట : పంటలు సాగు చేసే రైతులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చెమ్ముళ్ళపల్లెలో డ్రోన్ ద్వారా పంటలకు సోకిన తెగుళ్లకు మందులు ఎలా పిచికారీ చేయాలో తెలియజేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ గ్రామంలో నువ్వుల పంటలకు ఎండ తెగులు వస్తుందన్నారు. ఈ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటిలో 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు.

# కమాండ్ లేదు.. కంట్రోల్ లేదు!



కమాండ్ కంట్రోల్ సెంటర్


శివాలయం సెంటర్‌లో పని చేయని కెమెరాలు


సీసీ కెమెరాలు

- అలంకార ప్రాయంగా ప్రొద్దుటూరు కమాండ్ కంట్రోల్ సెంటర్
- పని చేయని సీసీ కెమెరాలు
- సొంత వాహనాల్లో తిరుగుతున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది
- 20 రోజులకే సరిపోతున్న పెట్రోల్ కూపన్లు
- సొంత డబ్బుతో బైకుల్లో తిరుగుతున్న సిబ్బంది
- లోపించిన అధికారుల పర్యవేక్షణ

ప్రొద్దుటూరు క్రైం : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రొద్దుటూరులోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ కాంపౌండ్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను 2018లో ఏర్పాటు చేశారు. పట్టణంలోని వ్యాపారులు, విద్యాసంస్థలు, అన్ని వర్గాల ప్రముఖులు, మున్సిపాలిటీ సహకారంతో నాటి డీఎస్పీ కొల్లి శ్రీనివాసులు పట్టణమంతా నిఘా కెమెరాలను ఏర్పాటు చేశారు. కూడళ్లతో పాటు వ్యాపార సముదాయాలు, ఆలయాలు, పట్టణ శివారులోని నలు మార్గాలలో అత్యాధునిక కెమెరాలను అమర్చారు. పట్టణం మొత్తంగా సుమారు 175కు పైగా కెమెరాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులు, కూడళ్లు, వీధులు కవర్ అయ్యేలా ఈ కెమెరాలను అమర్చారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వీడియో వాల్ ఆధారంగా ట్రాఫిక్, ఇతరత్రా పోలీసు భద్రతా చర్యలను ఇక్కడి నుంచే అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

**సగం సిబ్బంది కమాండ్ సెంటర్‌లోనే..**

అన్ని పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సగానికి పైగా సిబ్బంది కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఎక్కడైనా సంఘటన జరిగితే ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ సిబ్బందికి కమాండ్ కంట్రోల్ నుంచి సమాచారం అందిస్తారు. దీంతో వారు కొన్ని నిముషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకొని అక్కడి పరిస్థితిని చక్కదిద్దేవారు. అన్ని స్టేషన్ల పరిధిలో 8 బ్లూకోల్ట్స్ టీంలు ఇక్కడ పని చేస్తున్నాయి. వీరు మూడు షిప్టుల్లో వీరు విధులు నిర్వహిస్తారు. ఒక్కో షిఫ్టులో 16 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో 48 మంది పని చేస్తున్నారు. వీరు పట్టణమంతా తిరుగుతూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తుంటారు. వారి పరిధిలో ఏదైనా ఘర్షణ, ఇతర సంఘటనలు జరిగితే బాధితులను, నిందితులను బ్లూకోల్ట్స్ టీం సభ్యులు స్టేషన్‌కు తీసుకొని వస్తారు. అలాగే కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎస్ఐ, ముగ్గురు ఏఎస్ఐలు, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, ముగ్గురు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన ముగ్గురు కానిస్టేబుళ్లు పని చేస్తున్నారు.

**పని చేయని సీసీ కెమెరాలు**

ప్రొద్దుటూరు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పోలీసు అధికారులు ఇటీవల గాలికి వదిలేసినట్లు కనిపిస్తోంది. గతంలో సీసీ కెమెరాల ద్వారా పట్టణంలో ఛేదించిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఆటోలు, బస్సుల్లో విలువైన సామగ్రిని బాధితులు మరచిపోయినప్పుడు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించేవారు. పట్టణంలో 175 సీసీ కెమెరాలుండగా వాటిలో 35 మాత్రమే పని చేస్తున్నాయి. పట్టణంలోని పలు కూడళ్లు, శివారు ప్రాంతంలో కొన్ని చోట్ల మ్యాట్రిక్స్ కెమెరాలు ఉన్నా వాటి సీసీ పుటేజీ కావాలంటే విజయవాడ సెంట్రల్ మానిటరింగ్ టీం అధికారులను సంప్రదించాల్సి వస్తోంది. ఇటీవల పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా చోరీలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

**మూగబోయిన బ్లూకోల్ట్స్ సైరన్**

బ్లూ కోల్ట్స్ సిబ్బంది వారికి కేటాయించిన ప్రాంతాల్లో సైరన్ మోగించుకుంటూ నిరంతరాయంగా తిరుగుతుంటారు. సైరన్ మోగించడం వల్ల ఆ ప్రాంతాల్లో పోలీసులు తిరుగుతున్నారనే భయం దొంగల్లో ఉంటుంది. ఫలితంగా రాత్రి సమయాల్లో ఎలాంటి నేరాలు జరగకుండా నియంత్రించడానికి బ్లూకోల్ట్స్ వ్యవస్థ బాగా ఉపయోగపడుతుంది. ఏదైనా సంఘటన జరిగితే ఐదు నిముషాల్లో సంఘటనా స్థలానికి చేరుకునేలా అధికారులు ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది తిరిగే బైకులు చాలా వరకు పాడయ్యాయి. అయినా రిపేర్లు చేయించుకుంటూ సిబ్బంది తిరుగుతున్నారు. బైక్‌లు పాతబడిన కారణంగా తక్కువ మైలేజీ వస్తోందని సిబ్బంది చెబుతున్నారు. కొందరు సొంత వాహనాల్లో తిరుగుతూ విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని బైకులకు సైరన్ లేకపోవడంతో బ్లూకోల్ట్స్ పోలీసులు తిరుగుతున్నారో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక్కో బ్లూకోల్ట్స్‌కు మూడు షిఫ్టలకు గాను నెలకు 40 లీటర్ల పెట్రోల్ కూపన్లు ఇస్తున్నారు. అయితే 40 లీటర్ల పెట్రోల్ 20 రోజులకు కూడా రాదని సిబ్బంది వాపోతున్నారు. మిగిలిన రోజులకు సొంత ఖర్చులతో పెట్రోల్ నింపుకొని తిరుగుతున్నారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది సమస్యలపై అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

## సాక్షి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్


విద్యార్థినికి స్టడీ మెటీరియన్ అందజేస్తున్న దృశ్యం

చాపాడు : మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు మంగళవారం సాక్షి దిన పత్రిక ఆధ్వర్యంలో పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సాక్షి సర్కులేషన్ నియోజకవర్గ ఎస్ఆర్ శ్రీనివాసులు ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందజేశారు. మండలంలోని కస్తూర్బా, చాపాడు, లక్ష్మీపేట, చియ్యపాడు, అన్నవరం, నరహరిపురం, చిన్నగురువలూరు గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు ఉపయోపడేలా స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు శ్రీనివాసులు తెలిపారు.

## పలుకుబడి ఉంటేనే సబ్సిడీ రుణం

- మంజూరైన యూనిట్లు 164
- దరఖాస్తులు 3,586
- నేడు ఇంటర్వ్యూలు

| కులాలు | మంజూరైన యూనిట్లు | వచ్చిన దరఖాస్తులు |
|---|---|---|
| బీసీ - ఏ | 30 | 733 |
| బీసీ - బీ | 28 | 1426 |
| బీసీ - డీ | 32 | 313 |
| బీసీ - ఈ | 34 | 711 |
| కాపు | 23 | 124 |
| ఆర్యవైశ్య | 2 | 131 |
| బ్రాహ్మణ | 1 | 7 |
| కమ్మ | 3 | 2 |
| రెడ్డి | 6 | 86 |
| ఈబీసీ | 5 | 53 |

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం చంద్రన్న స్వయం ఉపాధి పథకం ద్వారా 2024–25 సంవత్సరానికి సంబంధించి సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేశారు. సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. మొత్తం అన్ని కులాలకు సంబంధించి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వారికి 164 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేయగా, 3,586 మంది దరఖాస్తు చేసుకున్నారు. పట్టణ పరిధిలోని దరఖాస్తుదారులు తమ వార్డు నాయకుల ద్వారా ఇప్పటికే సిఫారసు చేయించుకున్నారు. అధికార పార్టీ నేతల సిఫారసు ఉంటే కానీ సబ్సిడీ రుణాలు మంజూరయ్యే పరిస్థితి లేదు. ఇందు కోసం లబ్ధిదారులు నాయకుల చుట్టు ప్రదక్షణలు చేశారు.

## సామాజిక భాగస్వామ్యంతో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి

చాపాడు : సామాజిక భాగస్వామ్యంతో అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధి చెందుతాయని మండల విద్యాధికారి రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేట జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లకు సాల్ట్ కార్యక్రమంలో 120 రోజుల సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. అంగన్వాడీ వర్కర్లకు బాల్య సంరక్షణ, విద్య పాలసీలు, పిల్లల మెదడును అభివృద్ధి చేసే అంశాలు, భాషాభివృద్ధి, మేధో అభివృద్ధి, పిల్లల సమగ్ర అభివృద్ధిపై అవగాహన కల్పించారు. టీఎల్ఎం తయారి, ఈసీసీఈ వంటి అంశాలపై గ్రూపులుగా విభజించి చర్చించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రిజ్వాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

అట్లూరు : కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ భాస్కర్‌బాబు తెలిపారు.

## నేడు బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

మైదుకూరు : 2024–25 ఆర్థిక సంవత్సరం ఆర్థిక సంవత్సరానికి మంజూరైన బీసీ రుణాలకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులు, బ్యాంకర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు.

**చాపాడులో..**

చాపాడు : బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరకిషోర్ తెలిపారు.

ఖాజీపేట : వివిధ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీతో అందించే రుణాలకు పెద్ద ఎత్తున నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలన చేశారు.

మైదుకూరు : మైదుకూరు మండలంలో బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కింద స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

**మున్సిపాలిటీలో..**

మైదుకూరు మున్సిపాలిటీలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో 60 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు.

పోరుమామిళ్ల : బీసీ కార్పొరేషన్ రుణాలకు బుధవారం నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు.

రాజుపాళెం : 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను స్వయం ఉపాధి పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఎంపీడీఓ సభా భవనంలో ఇంటర్యూవ్యలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రొద్దుటూరు కల్చరల్ : కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు డివిజనల్ మేనేజర్ విలియం, సీనియర్ మేనేజర్ అరుణ్‌ఘోష్ తెలిపారు. మంగళవారం స్థానిక జిన్నా రోడ్డులోని కెనరా బ్యాంకు వద్ద నుంచి వివేకానంద క్లాత్ మార్కెట్‌లోని బ్యాంకు వద్దకు ఖాతాదారులకు కల్పిస్తున్న పథకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఖాతాదారులను దృష్టిలో పెట్టుకుని కెనరా బ్యాంకు ఏంజెల్ ఖాతాను ప్రారంభించిందన్నారు. ఈ ఖాతా ద్వారా రూ.10లక్షల వరకు క్యాన్సర్ చికిత్స కోసం అందిస్తామన్నారు. వ్యాపారులకు, వ్యవసాయం, హౌసింగ్, విద్యార్థులకు సులభతరంగా రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, మెయిన్ బ్రాంచ్ మేనేజర్ శరవణన్, గాంధీ రోడ్డు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పద్మావతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## భారతీయులపై అమెరికా దుశ్చర్యను ఖండించాలి

బద్వేలు అర్బన్ : భారతీయులపై అమెరికా వ్యవహరిస్తున్న దుశ్చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని పేర్కొన్నారు. అమెరికా నుంచి వందలాది మంది భారతీయులను బహిష్కరించి వారికి సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీలుగా పంపించడాన్ని నిరసిస్తూ మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను కూడా గౌరవంగా చూడాలనే నిబంధనలు ఉన్నప్పటికీ వలసదారులుగా ఉన్న భారతీయులను కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి యుద్ధఖైదీలుగా వెనక్కి పంపడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

ప్రొద్దుటూరు రూరల్ : కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ తెలిపారు. స్థానిక భగత్ సింగ్ కాలనీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పశువైద్య కళాశాల వర్కర్స్ సమస్యలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పశువైద్య కళాశాల వర్కర్లకు ఇబ్బంది కలిగించే జీఓ 2ను విడుదల చేయడం అన్యాయమన్నారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్, పశువైద్య కళాశాల యూనియన్ నాయకులు ఆర్‌వీ సుబ్బారావు, పీవీ రమణ, చిన్న ఓబులేసు, కుమార్, గోపాల్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత సమస్య పరిష్కరించండి

జిల్లా వ్యవసాయాధికారికి మండల వైఎస్సార్ సీపీ నాయకుల వినతి


జేడీకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఖాజీపేట : యూరియా కొరత కారణంగా మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. యూరియా కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వర్‌రావుకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పీవీ రాఘవ రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కడపలోని జేడీ కార్యాలయంలో జేడీని వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి యూరియా కొరాత సమస్య గురించి వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయితీలో రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆ కేంద్రాల ద్వారా యూరియా అమ్మకాలు చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బ్లాక్ మార్కెట్ సమస్య, అధిక ధరలకు విక్రయం ఇలాంటి సమస్యలు రైతులకు ఉండవన్నారు. మార్కెట్‌లో డీలర్లు ఇష్టానుసారంగా అమ్మకాలు చేస్తూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. సకాలంలో యూరియా దొరక పోవడం వల్ల రైతులు ఇతర ప్రాంతాల నుంచి అధిక ధరకు కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. అలాగే అధిక వర్షలు, వాతావరణ మార్పుల కారణంగా దెబ్బతిన్న పంటలకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, దుంపలగట్టు నాయకుడు రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

## రెవెన్యూ ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు రమాకుమారి

చాపాడు : గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండలంలోని సోమాపురం గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సుల ఫిర్యాదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ. గతంలో సభ దృష్టికి 29 ఫిర్యాదు రాగా ఇప్పటికే 18 పరిష్కారం చేశామని, మిగిలిన వాటిని త్వరలో పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. నేషనల్ గ్రీన్ ఫీల్డు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయి పరిహారం అందని రైతుల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, వీఆర్ఓ సుబ్బన్న పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి రూ.14 లక్షల విలువైన హారం కానుక


రాంపరివార్ హారాన్ని అందిస్తున్న కిరణ్, సత్యలత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ ఆంజనేయస్వామికి వెదుర్ల బజార్‌కు చెందిన ముడియం సాయిప్రసాద్, ఆయన భార్య అమ్మణ్ణి జ్ఞాపకార్థం రూ.14 లక్షలు విలువ చేసే రాంపరివార్ బంగారు హారాన్ని తయారు చేయించారు. ఈ హారాన్ని ఆయన కుమారుడు కిరణ్, కోడలు సత్యలత ఆలయ ఈఓ రమణారెడ్డి, ఆలయ చైర్మన్ వెంకటసత్యనారాయణకు అందించారు. ఈఓ, చైర్మన్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దాతల కుటుంబీకులు బాల విద్య, వెంకటరమణ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు


అవగాహన కల్పించేలా రూపొందించిన ఫ్లెక్సీలతో పోలీసులు

పోరుమామిళ్ల : ఇటీవల కాలంలో మితిమీరుతున్న రోడ్డు ప్రమాదాలపై ప్రజలను, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు పోరుమామిళ్ల పోలీసులు నడుం బిగించారు. డ్రైవర్లకు నేరుగా కౌన్సిలింగ్ ఇచ్చి రహదారి నిబంధనలు తెలిపారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం ఫ్లెక్సీ బోర్డులు తయారు చేయించి కూడళ్లలో ఏర్పాటు చేయించారు. బద్వేలు, మైదుకూరు, సీతారాంపురం, విజయవాడ, శ్రీశైలం, తిరుపతి రోడ్లల్లో వెళ్లే వాహనాలకు కనిపించే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కొండారెడ్డి మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిని అప్రమత్తం చేసేందుకు, ప్రమాదంలో మరణం సంభవిస్తే జరిగే పరిణామాలు, కుటుంబ పరిస్థితి తెలిపేలా బోర్డులను తయారు చేయించామన్నారు. మండల కేంద్రంలో వివిధ కూడళ్లలో మొత్తం 16 బోర్డులు ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కొండారెడ్డితోపాటు హెడ్‌కానిస్టేబుల్ దుర్గామోహన్, కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కూటమి ప్రభుత్వం

చాపాడు : కూటమి ప్రభుత్వానికి కనీసం బలం లేని తుని, పాలకొండ, పిడుగురాళ్ల లో మున్సిపల్ వైస్ చైర్మన్ ఉప ఎన్నికల్లో కూటమి నేతలు వ్యవహరించిన తీరుదుర్మార్గం. ప్రజాస్వామ్యాన్ని నడి బజార్లో ఖూనీ చేసిన కూటమి ప్రభుత్వాన్ని బంగాళఖాతంలో కలపాలని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం, నేతల రౌడీయిజం, గుండాయిజం, కిడ్నాప్‌లు, అనైతిక చూశాక మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అని ఆందోళన వ్యక్త పరిచారు. కూటమి పాలనను ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో బుద్ధి చెబుతారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి

గోపవరం : సోమశిల వెనుకజలాల్లో చేపలవేటకు వెళ్లేందుకు ఆసక్తి కలిగిన మత్స్యకారులు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బద్వేలు డివిజన్ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్, అసిస్టెంట్ కొండయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అడుసువారిపల్లె, సూరేపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాలకు చెందిన మత్స్యకారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమశిల వెనుకజలాల నుంచి పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. మత్స్యశాఖ నిబంధనల మేరకు లైసెన్సులు జారీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. లైసెన్స్ కోసం ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోస్టు సైజు ఫొటోతో బుధవారం ఉదయం 10:30 గంటలకు గట్టుపల్లె వద్ద దరఖాస్తు చేసుకున్న మత్స్యకారులకు నైపుణ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.